రక్తపుటేర్లు

వసుంధర

(గత సంచిక తరువాయి)

మంగళ హోటల్లో తన గదిలోకి వెళ్ళింది. ఇద్దరూ విశేషాలు మాట్లాడుకున్నారు. రామకృష్ణ చేసిన దొంగ తనం కారణంగా వచ్చిన ఇబ్బందుల గురించి చర్చించు కున్నారు. ఈలోగా ఆ గదికి విజయబాబు వచ్చాడు. మంగళ దాక్కుంది. మధురిమ అక్కా చెల్లెళ్ళ రహస్యాన్ని మినహాయించి మిగతాది విజయబాబుకి చెప్పింది. పట్టరాని ఆగ్రహంతో అతడామెను కాల్చి చంపాడు.

"చంపడూ మరి! మధురిమ అజాగ్రత్తవలన అతడి జీవితం సర్వనాశనమైంది—" అన్నాడు రామకృష్ణ.

మంగళ చెబుతున్న కథ జాహ్నవికి చాలా విచిత్రంగా వుంది. మంగళ అనాకారితనాన్ని ప్రేమించాడన్న నెపంతో ఆమె బురఖా స్త్రీగా మారి ప్రతాప్ ఇంట్లో అడుగుపెట్టింది.

"ప్రతాప్‌కి మీ రహస్యం ఎలా తెలిసిపోయింది?" అంది జాహ్నవి.

"అతడికి మా రహస్యం తెలిసిందనుకోవటం మా పొరపాటు. ఆ ఒక్క పొరపాటు కథను ఎన్నో మలుపులు తిప్పింది....."

"మరి అతను అనాకారి మంగళను ప్రేమించినట్లు ఎందుకు నటించాడు?"

మంగళ నవ్వింది — "సృష్టిలో రకరకాల మనుషులుంటారు. వారి అభిరుచులు చిత్రవిచిత్రంగా ఉంటాయి. మనం తెలుపు చూసి మురిసిపోతాం. అమెరికన్ యువతులు నల్లని నీగ్రోలంటే అపరిమితమైన మోజు చూపిస్తారు..."

"అంటే?" అంది జాహ్నవి.

"ప్రతాప్‌కి నలుపన్నా, అనాకారితనమన్నా ఏదో చెప్పలేని ఆకర్షణ ఉన్నదని నా అనుమానం. మధురిమ చెప్పింది-అనాకారి రూపంలో ఉన్నతనవతడు గాఢంగా ముద్దు పెట్టుకున్నాడని. మనిషి కాంక్షను ముద్దుతో అంచనా వేయవచ్చు. ఆ తర్వాత నేను అనాకారిననే భావంతో అతడు వారింటికి నేను చేరిన రాత్రి పెట్టుకున్న ముద్దు-అతడికి అనాకారితనంపట్లగల ఆకర్షణను చెప్పకనే చెబుతుంది—" అంది మంగళ.

ఈ సంభాషణ జాహ్నవికి అంతగా రుచించలేదు. ప్రతాప్ వేరే యువతిని ముద్దు పెట్టుకున్నాడన్న భావం ఆమె మనసును కలవరపరిచింది — "నువ్వు కల్పించి చెబుతున్నావు. ప్రతాప్ అలాంటివాడు కాదు...."

"అంటే?"

"పరాయి స్త్రీలను ముద్దు ..." అని ఆ మాట అనడానికే సంకోచంగా ఆగిపోయిందామె.

మంగళ తమాషాగా నవ్వింది—"ముద్దేం కర్మ—అతడి లీలలు అంతకంటే ఎక్కువే చూశాన్నేను...."

"ఏం చూశావ్?"

"అతడికి వంటమనిషి సావిత్రితో అక్రమ సంబంధముంది. నేను నా కళ్ళారా చూశాను. అయితే ఈ విషయం అతడి తలిదండ్రులకన్నా తెలియదు...."

జాహ్నవికి కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది—"నువ్వు

తిరుగుబోతుని. అందుకే నీ నోటికి హద్దూపద్దూ లేకుండా ఉంది—"

మంగళ చిన్నబుచ్చుకోలేదు. "నేను నర్తకిని. కొందరు నాట్యం చేసి శరీరాన్ని కదిలిస్తారు. నేను శరీరభాగాల్ని ప్రదర్శిస్తాను. మగవాళ్ళు నా చుట్టూ తిరిగే మాట నిజం. కానీ నేను నా చుట్టూ ఒక వలయం ఉంచుకుని ఆ వలయానికి అవతల నే మగవాళ్ళను నిలబెడుతున్నాను. ఆ విషయమై ఎవర్నీ నమ్మించాలని నేను అనుకోవడంలేదు. నా గురించిన నిజం చెబుతున్నాను. అంతే! సావిత్రి నాకులాగే నిజాయితీపరురాలు. ఆమె నడిగితే నీకు నిజం తెలుస్తుంది. ఆమె అబద్ధమాడదని నా నమ్మకం...."

ఏమనాలో తెలియలేదు జాహ్నవికి. రామకృష్ణ ఆమెకు సాయం చేశాడు — "నీ వృత్తిలో పవిత్రత అసాధ్యమేనని చాలామంది అనుకుంటారు. అలా అనుకోవడంలో తప్పులేదనుకుంటాను...."

మంగళ మళ్ళీ నవ్వింది—"జాహ్నవికి ప్రతాప్ బావ అవుతాడు. జాహ్నవి అందం చూస్తూంటే ఆడదాన్ని నాకే మతిపోతోంది. అలాంటిది ఆమె బావ ప్రతాప్ ఆమెను కాదన్నాడంటే నలుగురూ జాహ్నవి శీలాన్ని శంకిస్తే అందులో తప్పుంటుందంటారా?"

జాహ్నవి ముఖం ఎర్రగా అయింది. రామకృష్ణ జాహ్నవిని నొప్పింపజేసే జవాబు వచ్చే ప్రశ్న తను వేశానని బాధపడ్డాడు తప్పితే మంగళను ఏమీ అనలేక పోయాడు. ఆమె అడిగిన ప్రశ్న న్యాయంగానే ఉంది మరి!

మంగళ వెంటనే తనే అందుకుని—"ఊరికే వాదన కోసం అలా అన్నాను. ఈమెను చూస్తూంటే అలాంటి

మాట అన్నవారి నాలుకను చీల్చి వేయాలనిపిస్తుంది. మానవలోకంలో పుట్టాల్సిన మనిషి కాదీమె!" అంది.

జాహ్నవి సిగ్గుపడి-"నేను నిన్ను చెడ్డమాటలన్నాను. నువ్వు నన్ను మంచిమాటలంటున్నావు. నాకంటే నువ్వే గొప్పదానివి...." అంది.

"నువ్వన్నా నన్ను గొప్పతనం అంటదు. నీకూ నాకూ ఓ పెద్ద తేడా వుంది. ఎవరైనా నన్ను ప్రేమించాడనుకో. వాడు నా భుజంమీద చెయ్యి వేస్తాడు. నిన్ను ప్రేమించినవాడు నీ కాళ్ళమీద పడతాడు. నన్నిద్దరు ప్రేమిస్తే — వాళ్ళిద్దరు కూడబలుక్కుని వంతులుగా నన్ననుభవించాలనుకుంటారు. నిన్నిద్దరు ప్రేమిస్తే వాళ్లలో వాళ్ళు పోరాడుకుని ఒకరినొకరు హతమార్చుకోవాలనుకుంటారు. నాకోసం డబ్బు ప్రవహిస్తుంది. కానీ నీకోసం రక్తం ప్రవహిస్తుం...." అంది మంగళ.

"నువ్వు నిజమే చెప్పావు. జాహ్నవికి ఏ సంబంధం కుదిరినా వరుడు వెంటనే హత్యచేయబడుతున్నాడు..." అన్నాడు రామకృష్ణ.

"హంతకుడు దొరకలేదా?" అంది మంగళ ఆశ్చర్యంగా.

"ఇప్పుడా అనుమానం విజయబాబు మీద ఉంది—" అన్నాడు రామకృష్ణ-"అతడు చాలాకాలంగా జాహ్నవి మీద కన్నువేశాడు. ఆమెకు కుదిరిన ఒకో వరుడినే చంపాలని పథకం వేసుకున్నాడు. అలా కొందరు చచ్చేక ఆమె తనను కాదనలేదని అతడి ఆశ. అందుకు కొన్ని ఋజువులున్నాయి. విజయబాబు సగం ఒప్పుకున్నాడు...."

జాహ్నవి ముఖం పాలిపోయింది. "నా కోసం విజయ

బాబు అనేవాడు పథకంవేసి ఇలా వరుసగా ఒక్కొక్కరినే హత్య చేస్తున్నాడా? ఎంత ఘోరం? నాకోసం రక్తపుటేర్లు ప్రవహిస్తే అది నాకు సంతోషాన్నెలా ఇస్తుంది?"

"మనుషుల ఆలోచన అలాగే ఉంటాయి. ఒకవేళ ప్రతాప్‌కీ విషయం తెలుసునేమో! అందుకే అతడు జాహ్నవికి దూరంగా ఉంటున్నాడేమో? ఆమెతో వివాహం తన ప్రాణం తీస్తుందని అతడు భయపడుతున్నాడేమో?" అంది మంగళ ఆలోచిస్తూ.

జాహ్నవి కూడా ఆలోచనలో పడింది.

ప్రతాప్ తనలో ఏదో లోపముందన్నాడు.

అది ప్రాణభయమా?

లేక అతడి అనాకారితనమంటే మాత్రమే ఆకర్షణ ఉన్నదా?

జాహ్నవికి ప్రతాప్ మాటలు గుర్తుకువస్తున్నాయి. తనకు సంబంధం కుదిరితే అతడిలో స్పష్టమైన నమ్మకం కనిపించేది. ఆ వరుడు చావాలని తను కోరుకుంటే— చస్తాడని అతడు నమ్మేవాడు. ఆ నమ్మకంలో భయంలేదు. సంతోషం ఉండేది. అతడి నమ్మకమూ, సంతోషమూ చూస్తూంటే ఆ హత్య అతడే చేశాడా అనిపించేది. చావు వార్త విన్నాక అతడిలో ఆశ్చర్యం కూడా కనబడేది కాదు.

ప్రతాప్ తన లోపం గురించి మరీమరీ మాట్లాడేవాడు. నొక్కి చెప్పేవాడు. ఏమిటా లోపం?

ఆ లోపం సవరించుకుందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నానన్నాడు. కొద్ది రోజుల్లో ఫలితం కనబడవచ్చు కూడా అన్నాడు.

ఏమిటా ప్రయత్నాలు?

మంగళ, రామకృష్ణ చాలా చాలా మాట్లాడుకుంటున్నారు. మాటల మధ్యలో రామకృష్ణ అన్నాడు—"ఇప్పుడు జాహ్నవిని చేసుకోబోయేవాడు నిజంగా అదృష్టవంతుడు. ఆమెను ప్రేమించినవారి ఊళ్ళో చాలా మంది ఉన్నారు. వారిలో చాలామంది అసమర్థులు. కొందరు ప్రమాదకారులు. ప్రమాదకరమైన వారందరూ మధురిమ కారణంగా పట్టుబడి పోలీసు కస్టడీలో వున్నారు. ఇప్పుడు జాహ్నవిని వివాహమాడదల్చుకున్న వాడికి ఏ అడ్డూ లేదు—"

ఈ మాటలు జాహ్నవి చెవులబడ్డాయి. తనకూ, ప్రతాప్‌కీ మధ్య అడ్డంకులన్నీ ఒకటొక్కటిగా తొలగిపోతున్నాయా?

ఆమె ఆలోచిస్తూండగానే మంగళ చెప్పింది—"రామకృష్ణా! ప్రస్తుతం నా ఉనికిని బయటపెట్టకు. నీకే సాయం కావాలంటే అది చేస్తాను. నువ్వెలా మసులుకోవాలంటే అలా మసులుకుంటాను—"

"నువ్వు కొంతకాలం బురఖా యువతిగానే ఉండు" అన్నాడు రామకృష్ణ.

మర్నాటికి జాహ్నవి పెళ్ళికొడుకుల హత్య వివరాలు బయటకు వచ్చాయి. అదంతా తన పథకమేనని విజయబాబు ఒప్పుకున్నాడు. మధురిమలో మూడు పువ్వులూ, ఆరు కాయలూగా విలసిల్లిన తన స్మగ్లింగ్—జాహ్నవి రాకతో మరింత వృద్ధి చెందుతుందని అతడు భావించాడు. జాహ్నవి వంటి సజ్జనుల జోలికి వెళ్ళాలనుకోవడంవల్లనే తన పథకం బెడిసికొట్టిందని అతడు వాపోయాడు. ఈ వార్త జాహ్నవిని బాగా కృంగదీసినా—ఆ హత్యలకూ

ప్రతాప్‌కూ సంబంధం లేనందుకు ఆమె సంతోషించింది.

అయితే జాహ్నవి ఉండబట్టలేక ఆ ఉదయమే ప్రతాప్ ఇంటికి వెళ్ళింది. ఆమె వెళ్ళేసరికి ప్రతాప్ ఇంకా లేవలేదు.

"లేచినా మన మనిషి కాదమ్మా—వారం పదిరోజులు యెవర్నీ తన జోలికి రావద్దని అన్నాడు వాడు. భోజనం కూడా వాడి గదిలో పెట్టేసి వస్తున్నాను...." అంది లక్ష్మమ్మ కూర తరుక్కుంటూ.

అప్పటికి ఆ విషయం గుర్తించిన జాహ్నవి— "అత్తయ్యా — సావిత్రి లేదా?" అనడిగింది. సావిత్రి ఉంటే వంటపని లక్ష్మమ్మ చేయదు.

"లేదమ్మా—ఈ రోజే సెలవు తీసుకుని వెళ్ళిపోయింది. పదిరోజులు సెలవు కావాలంది. వదరదని అంటే ఎన్నడూ లేనిది ఎదురుతిరిగింది. పని మానేస్తానంది. అదృష్టం బాగుంటే ఈ అమావాస్య తర్వాత తన రోజులు మారతాయంది—" అంది లక్ష్మమ్మ.

"ఏముందీ-అమావాస్య తర్వాతా?" అంది జాహ్నవి ఉలిక్కిపడి. తనకు కూడా ప్రతాప్ అమావాస్య తర్వాత లోపం సవరించబడుతుందని చెప్పాడు.

"ఏం—అలా అడిగావ్?" అంది లక్ష్మమ్మ.

జాహ్నవి బదులివ్వలేదు. ఆమె ఆలోచిస్తూ— "అత్తయ్యా—బావ సావిత్రితో యెలాగుండేవాడు!" అనడిగింది.

లక్ష్మమ్మ వెంటనే ఏమీ చెప్పలేదు. కాస్సేపయ్యాక మాటలలో—ఓసారి అతడు ఏ సందర్భంలో సావిత్రిని పెళ్ళిచేసుకుంటానన్నాడో చెప్పింది. అది విని జాహ్నవి ఆశ్చర్యపడింది.

ప్రతాప్‌లో ఏదో రహస్యముంది?

"ఏమిటది?

మంగళ, నల్లగా, అనాకారితనంలో ఉంటే అతడు ఆమెను రోడ్డుమీద ముద్దుపెట్టుకున్నాడు. తనూ అలా గుంటే....

తను అనాకారి కాదు. తన వంటిరంగు నలుపుకాదు.

అయితే మంగళా అనాకారి కాదు. ఆమె వంటి రంగూ నలుపు కాదు.

హఠాత్తుగా తన ఆలోచనకీ దారిని మళ్ళడానికి కారణమేమిటి?

అర్ధంకాలేదు జాహ్నవికి. ఎవరో చెప్పినట్లు హఠాత్తుగా తన బుర్రలో ప్రవేశించింది ఆ ఆలోచన.

జాహ్నవి ఆలోచిస్తోంది. అమావాస్య నాటితో తన లోపం సవరించబడుతుందని ప్రతాప్ అన్నాడు. అమావాస్యనాడు తను మంగళవలా నల్లగా, అనాకారిగా మారగలిగితే!

అమావాస్యనాడు....అమావాస్యనాడు....

ఎందుకు తనకలా అనిపిస్తోంది?

జాహ్నవి ప్రతాప్ ఇంట్లోంచి బయటకు వచ్చింది. రోడ్డుమీద ఆమెకు ముందుగా ఓ ముసలివాడు ఏవో గొణుక్కుంటూ నడుస్తున్నాడు. వాడి మాటలు జాహ్నవికి స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"అమావాస్యనాడు....అమావాస్యనాడు....

జాహ్నవి నడక వేగం పెంచి ఆ ముసలాణ్ని సమీపించి—"ఏయ్—ఎవర్నువ్వు?" అంది.

ఆ వృద్ధుడు తల వంచుకున్నవాడల్లా చటుక్కున తలెత్తి-"ఊఁ" అన్నాడు. అతణ్ని చూస్తూనే జాహ్నవి

ఉలిక్కిపడింది.

ప్రతికున్న పిశాచంలా ఉన్నాడతను.

"ఎవర్నువ్వు?" అంది జాహ్నవి మళ్ళీ.

"పంచమి, షష్టి, సప్తమి, అష్టమి, నవమి, దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి— మొత్తం పది రోజులు. పదకొండోరోజు అమావాస్య. అమావాస్య నాడు...."

"ఊఁ అమావాస్య నాడు...." అంది జాహ్నవి.

"నల్లగా వుంటుంది. నలుపే ఓ పెద్ద అనాకారితనం."

నల్లగా....అనాకారితనం....జాహ్నవి బుర్రలో ఏదో మెదుల్తోంది. ఏదో సూచన ఆమెకు....

"ఎవర్నువ్వు?" అందామె.

"నన్నందరూ మంత్రగాడంటారు. కానీ బాబా అనిపించుకోవడమే ఇష్టం నాకు...." అన్నాడా వృద్ధుడు.

"ఎందుకని?" అంది జాహ్నవి.

"నేను కొన్ని శక్తుల్ని ఉపాసిస్తున్నాను. అందువల్ల నాకు కొన్ని శక్తులు సంక్రమించాయి. అందువల్ల చాలా మంది నన్ను మంత్రగాడంటారు. కానీ నేను నా మంత్ర శక్తుల్ని మానవ శ్రేయస్సుకే ఉపయోగిస్తాను. అందుకని బాబా అనిపించుకోవాలిగదా!"

"నీ శక్తుల్ని మానవ శ్రేయస్సుకుపయోగిస్తావని నమ్మకమేమిటి?" అంది జాహ్నవి.

"ఉదాహరణకు నీ సంగతి తీసుకో. నువ్వు ప్రతాప్‌ని ప్రేమిస్తున్నావు. కానీ అతడిలో ఏదో లోపముంది. ఆ లోపం పోగొట్టి మీ ఇద్దర్నీ ఒకటి చెయ్యాలనుకోవడం సత్కార్యమేనా, కాదా?" అని అతడు ముందుకు

నడవడం ప్రారంభించాడు.

జాహ్నవి అతడిని అనుసరిస్తూ — "ఇవన్నీ నీకెలా తెలుసు? ప్రతాప్ లోని లోపమేమిటి?" అని అడిగింది.

"అవన్నీ ఇప్పుడు చెప్పకూడదు...." అన్నాడు బాబా.

"పోనీ అతడి లోపం పోగొట్టడానికి నువ్వేం చేస్తున్నావ్?"

"అది కొంత చెబుతాను. వచ్చే అమావాస్య రోజున నల్లని దేహఛాయతో, అనాకారి రూపంలో ప్రతాప్ కి కనిపించు. అతడేం చేసినా అభ్యంతరం పెట్టకు. అతడి లోపం తొలగిపోతుంది. నీ మనోవ్యథ కూడా తొలగిపోతుంది...." అన్నాడు బాబా నడుస్తూనే.

"అతన్నెక్కడ కలవాలి బాబా?" అంది జాహ్నవి.

"అది ఇప్పట్నించీ అడక్కు...." అన్నాడు బాబా— "ఇదంతా పెద్ద రహస్యం. నీకూ నాకూ తప్ప యెవరికీ తెలియకూడదు. గుర్తుంచుకో....అమావాస్య నాడు...."

బాబా వెళ్ళిపోయాడు.

జాహ్నవి ఇంటికి వెళ్ళింది. తను నల్లగా మారడానికి మంగళ సాయమూ, సలహా తీసుకోవాలని ఆమె అనుకుంది.

* * *

ఆ రోజు అమావాస్య.

జాహ్నవి ఆ రోజు చాలా ఉత్సాహంగా వుంది. తన జీవితంలో ఏదో గొప్ప మార్పు వస్తుందని ఆమె ఆశిస్తోంది.

మంగళ ఆమెకు నల్లగా తయారవడం యెలాగో చెప్పింది. కానీ ఆమె ఇప్పుడు ఇంట్లో లేదు. ఆమెను

రామకృష్ణ ఎక్కడికో రహస్యంగా పంపించేశాడు. అతడీ ఊరు వచ్చిన వ్యవహారాలన్నీ ఒకటొక్కటిగా ముగుస్తున్నాయి. ఇంక రెండు మూడు రోజుల్లో అతను మకాం ఎత్తేయవచ్చు.

"ఒకేఒక్క ముఖ్యమైన పని మిగిలిపోయింది. అదీ ముగిస్తే నా జీవితంలో ఇంత జయప్రదమైన ట్రిప్పు ఉండదు—" అన్నాడు రామకృష్ణ జాహ్నవితో.

"ఏమిటా మిగిలిపోయిన పని!"

"ఒకరోజున — అనగా మొదటిసారి మీ ఇంట్లో నేను అడుగుపెట్టిన రోజున మీ అమ్మగారు నేను ఢిల్లీ పెళ్ళికొడుకననుకుని మర్యాదలు చేశారు. ఆ విధంగా చూస్తే మీకై వచ్చిన మొదటి పెళ్ళికొడుకును నేనే.... అలా వచ్చి ఇంతవరకూ బ్రతికి ఉండడం కూడా నా అదృష్టం. మీకై వచ్చినవారంతా శవాలుగా మారిపోయారు. మీరు కాదంటే నేనూ బ్రతికున్న శవాన్నవుతాను. అవునంటే శవమైనా బ్రతికి వస్తాను...." అన్నాడు రామకృష్ణ.

జాహ్నవి నివ్వెరపోయింది — "మీరు....మీరు.... నన్ను ప్రేమిస్తున్నారా?" అందామె.

"మీరు నా ప్రేమను అంగీకరిస్తే అది నా అదృష్టం. నేను మిమ్మల్ని ప్రేమించడంలో ఆశ్చర్యమేముంది? అది సహజం—" అన్నాడు.

"ఏమో— నేను మీ గురించి ఎన్నడూ ఆలోచించ లేదు...."

"కానీ నేను ఈ గుమ్మంలో అడుగుపెట్టిన క్షణం నుంచీ మీ గురించే ఆలోచిస్తున్నాను. నా వృత్తిలో నేనెప్పుడూ ఇంతగా రాణించలేదు. మిమ్మల్ని చూసేక

నాలో ఉత్సాహం పొంగి—సమరత పూర్తిగా వెకి వచ్చింది. మేధను పదును పండింది. జీవితంలో ఎన్నో సాధించి మీ మెప్పు పొందాలనుకున్నాను. ఊరు వదిలేటప్పుడు మీతో కలిసి కదలాలనుకున్నాను...."

జాహ్నవి ఇబ్బందిగా — "మనమీ విషయం రేపు మాట్లాడుకుందాం—" అంది.

"ఏమిటి రేపటి విశేషం?" అన్నాడు రామకృష్ణ.

"ఈ రోజు అమావాస్య కదా!" అన్నదామె.

రామకృష్ణ ఇంకేమీ అడగలేదు. ఆమెకు సెంటిమెంటు ఎక్కువ కాబోలనుకున్నాడు. అమావాస్య మంచిరోజు కాదు గదా!

అతను ఇంట్లోంచి బయటకు వెళ్ళిపోయాడు.

సుమారు పదిగంటల ప్రాంతాల జాహ్నవి ఒక్కతీ వీధిలో నిలబడింది. నెమ్మదిగా ఎక్కణ్ణించో బాబా వచ్చాడు.

"రాత్రి పన్నెండింటికి .... పాడుపడిన శివాలయం దగ్గర .... మరిచిపోకు .... నీకు శుభం జరుగుతుంది....

బాబా త్వరగా వెళ్ళిపోయాడు.

అతడి మాటలు మననం చేసుకుంటూ జాహ్నవి లోపలకు వెళ్ళిపోయింది. అర్ధరాత్రి పన్నెండింటికి శివాలయం దగ్గరకు వెళ్ళడంలోని ప్రమాదం గురించి ఆలోచించడంలేదు. ఆమె మనసులో ఎక్కడా భయమన్నది లేదు.

ఆమె ఆత్రుతగా — ఎప్పుడు చీకటి పడుతుందా, ఎప్పుడు రాత్రి పన్నెండవుతుందా అని ఆలోచిస్తోంది.

* * *

రాత్రి తొమ్మిది గంటలు.

శివాలయం దగ్గర బాబా గొయ్యి తవ్వుతున్నాడు. అతడికి దగ్గర్లోనే ప్రతాప్ వున్నాడు.

"బాబా— నేను సాయంచేయనా?"

"వద్దు. ఈ గొయ్యి నేనే స్వయంగా తవ్వాలి!"

బాబా చెమటలు కక్కుతున్నాడు. కానీ గొయ్యి తవ్వడం మానలేదు. ఆ పని ఇంకా అయిదారు గంటలు పట్టవచ్చు.

ప్రతాప్ చుట్టూ చూశాడు.

మొత్తం పదిగోతులుండేవి. ఇప్పుడెక్కడా ఒక్క గొయ్యి కూడా లేదు. ఏమయ్యాయా గోతులు?

సావిత్రి....నిర్మల....దమయంతి....కోమలి....

ఒకరు కాదు....ఇద్దరు కాదు....పదిమంది!

పది గోతుల్ని మాయంచేశారు.

ప్రతాప్ శరీరం జలదరించలేదు. అతడా రోజు కార్యక్రమానికి సన్నద్ధమవుతున్నాడు.

"గుర్తుంచుకో—నువ్వు మనిషివి కాదు....మృగానివి!" అంటున్నాడు బాబా మధ్య మధ్యలో.

"గుర్తుంది బాబా!" అన్నాడు ప్రతాప్-"ఈ రోజు వచ్చే ఆమె ఎవరో తెలుసుకోవాలని కుతూహలంగా వుంది—"

"మన పూజకు అన్నివిధాలా అర్హురాలైన యువతి ఆమె. ఇంతవరకూ పురుష స్పర్శ ఎరుగని పడతి ఆమె. బేతాళుడిని పూర్తిగా ప్రసన్నం చేసుకోగల రక్తపు ధారలు చిందించగల రమణి ఆమె. నువ్వు నిస్సందేహంగా విజృంభించు. పూజా విధి సక్రమంగా నిర్వహించు. కొన్ని దుష్టశక్తులామెను ఆవహిస్తాయి. నిన్ను తప్పుదారిని పెట్టడంకోసం ఆమె ఏవేవో అరుస్తుంది. నిన్ను మోసం

చేయడానికి ప్రయత్నిస్తుంది. మాయమాటలు చెప్ప డానికి ప్రయత్నిస్తుంది. నువ్వామె మాటలు వినడానికి ప్రయత్నించకు. ఏకాగ్రతతో-నీ దృష్టిని చేతలమీదకు సారించు...." బాబా గొయ్యి తవ్వుతూనే అన్నాడు.

బాబా ఒకో ముక్కా అంటూంటే ప్రతాప్‌లో ధీమాంతత్వం చోటుచేసుకుంటోంది. అతడిలో ఆవేశం రగు లోంది.

కాలం పరుగెడుతోంది.

బాబా గొయ్యి తవ్వడం సగం పూర్తయింది.

"ఉన్నట్లుండి — "అదిగో — ఆమె వస్తోంది!" అన్నాడు బాబా.

ప్రతాప్ చూశాడు. దూరంగా ఒక యువతి!"

"గుర్తుంచుకో....నువ్వు మృగానివి...."

• • •

సుకుమార్‌కి నిద్రపట్టడం లేదు. టైము పన్నెండు కావస్తోంది. పావుగంటో, ఇరవై నిమిషాలో ఉన్నట్లుంది.

అతను కాసేపేదైనా నవల చదువుదామనుకున్నాడు.

పెర్రీమాసన్ నవల ఒకటి జాహ్నవి గదిలో వుంది. అది తెచ్చుకోవాలి.... సుకుమార్ జాహ్నవి గదిలోకి వెళ్ళాడు. గదిలో దీపం వేశాడు.

అక్కడ పుస్తకం వుంది జాహ్నవిలేదు.

ఈ సమయంలో ఆమె ఎక్కడికి వెళ్ళింది.

సుకుమార్ పెద్దగా కలవర పడలేదు. ఓ పావు గంట తర్వాత అతనే కాదు.... మొత్తం ఇంటిల్లపాదీ కలవరపడుతున్నారు.

రామకృష్ణ ప్రతాప్ ఇంటికి పరుగెత్తాడు. అతనెంతో హడావుడి చేస్తేగానీ ఇంటి తలుపులు తెరుచుకోలేదు.

సీతాపతి, లక్ష్మమ్మ—గాఢనిద్రలో వున్నారు. మొత్తం మీద సీతాపతి లేచి తలుపులు తీశాడు.

"జాహ్నవి ఇక్కడెందుకుంటుందీ?" అన్నాడాయన విసుగ్గా.

రామకృష్ణ తడబడకుండా—"ఆమెను వెదకడంలో అతడి సాయం కావాలి నాకు...." అన్నాడు.

అప్పటికి సీతాపతికి వ్యవహారం అర్థమయింది.

ఇంట్లో ప్రతాప్ లేడు.

ప్రతాప్ మంచంమీద ఓ పుస్తకం.... పేజీలు తెరచి ఉన్న పుస్తకం ... తెరచి వున్నచోట — "ఈ రోజు అమావాస్య. బహుశా రేపట్నించి నేనూ, జాహ్నవీ....

ఇంకేమీ రాసిలేదు.

రామకృష్ణ చటుక్కున ఆ పుస్తకం అందుకున్నాడు. ఓ పేజీ వెనక్కు తిప్పాడు.

నే నేం చేసినా....అంతా జాహ్నవికోసం....

ఈ రోజు....పాడుబడిన శివాలయం దగ్గర.... నేను చేసిన దానికి నేను కర్తను కాదు. భారమంతా బాబా మీద వేశాను....

చదువుతూంటే రామకృష్ణ కళ్ళు జలదరించింది.

"ఏమిటి బాబూ—అది!" అన్నాడు సీతాపతి.

"ఒకందుకొస్తే ఒకటి దొరికింది. నేను అర్జంటుగా పాడుపడిన శివాలయం వద్దకు వెళ్ళాలి. మీరు రఘురాం గారింటికి వెళ్ళి సాయపడండి.

రామకృష్ణ హడావుడిగా పరుగెత్తాడు.

* * *

"నా పేరు ప్రతాప్!" అన్నాడు ప్రతాప్.

"ఊఁ" అందామె.

"బేతాళుడి ఆజ్ఞ మీద నువ్విక్కడకు వచ్చావు!"

"ఊఁ."

"నేను మనిషిని కాదు — పశువుని...." అన్నాడు ప్రతాప్.

"కాదు....మనిషివి...." అందామె చటుక్కున.

"నేనన్నదానికి నువ్వు కాదనకూడదు—" అన్నాడు ప్రతాప్. అతడు ఆమెతో తన పూజ ప్రాముఖ్యత గురించి చెప్పాడు.

"నీ సహకారం అర్థిస్తున్నాను. నీకు బాధగా వున్నా సహించాలి. నా చేతలన్నీ సహించాలి. ఇది నా జీవిత సమస్య...."

ఆమె తలాడించింది.

ఇద్దరూ బేతాళ విగ్రహాన్ని సమీపించారు. ఆ విగ్రహాన్ని చూస్తూనే ఆమె గతుక్కుమంది. అంత భయంకరమైన విగ్రహాన్నామె ఎప్పుడూ చూడలేదు.

దూరంగా బాబా గొయ్యి తవ్వుతున్నాడు.

"అక్కడెవరో ఉన్నారు...." అందామె.

"మనవాడే....బాబా!" అన్నాడు ప్రతాప్.

"ఏం చేస్తున్నాడక్కడ?"

మన పూజకోసమే స్వయంగా శ్రమిస్తున్నాడు...."

ఆమె మళ్ళీ బేతాళ విగ్రహాన్ని చూసింది. భయంతో కళ్ళు మూసుకుంది.

కళ్ళు తెరిచేసరికి ప్రతాప్ చేతిలో పైటకొంగు వుంది.

"ఏమిటిది?" అందామె.

ప్రతాప్ ఆమెను బలంగా హత్తుకున్నాడు. ఆమె

విడిపించుకోవాలని చూసింది. అతను సాగనివ్వలేదు.

ఆమె ఆలోచిస్తోంది. తానతన్ని అభ్యంతర పెట్టాలా? లేక మౌనంగా సహించాలా?

తను ప్రతాప్ కోసం కలలు కంటోంది. అతడి పూజకీ రోజు భంగం చేయవచ్చునా, కూడదా? కానీ ఇలా ఉందేమిటి?

ఎలా ఉంటే నేం? ప్రతాప్ తనవాడు....

ఆమె సందిగ్ధంలో పడుతూంటే ప్రతాప్ ఆలోచించ డంలేదు. అతనింకా పశువులా ప్రవర్తించలేదు. మనిషిలా ప్రవర్తిస్తూ అందుకు కావలిసిన సన్నాహాలు చేసుకుం టున్నాడు.

* * *

పాడుపడిన శివాలయం వివరాలకోసం రామకృష్ణ ఆ పుస్తకంతో పావుగంటసేపు గడపవలసి వచ్చింది. ఆ వివరాలు చదువుతూంటే అతడి గుండె ఆగిపోయినంత పనయింది.

ప్రతాప్ ఇలాంటివాడని తనూహించలేదు.

ఈ రోజతడి పాల్పడిన అమాయకురాలెవ్వరో!

తను త్వరపడాలి .... అతను జేబులోని రివాల్వర్ తడుముకున్నాడు.

* * *

"ప్రతాప్..హద్దు మీరుతున్నావు..నన్ను వదులు..."

"నేను నిన్ను వదలను...."

"ప్రతాప్...."

"పేరెట్టి పిలవకు..నేను మనిషిని కాదు..పశువుని..."

ఆమె తెల్లబోయింది. అదేదో పెద్ద విశేషమైనట్లు చెబుతున్నాడు.

అయితే అతడి పశుత్వం ఆమెకు తెలుస్తోంది. తను అక్కడికి రావడం తప్పైనట్లు గ్రహించింది. అటూ యిటూ పరుగెత్తింది. అతనామెను క్రూరంగా తరుముతున్నాడు. గిల్లుతున్నాడు. రక్కుతున్నాడు. కరుస్తున్నాడు. ఫలితంగా ఆమె కూడా అతణ్ని గిల్లి, రక్కి కరవాల్సి వస్తోంది. ఆ విషయంలో ఎంతో అనుభవమున్నవాడిలా ఒడుపుగా తప్పుకుంటున్నాడు.

అతడి పశుత్వాన్నెలా వారించాలో ఆమెకు తెలియు లేదు.

"ప్రతాప్! నేను....జాహ్నవిని...." అందామె.

"జాహ్నవి...." అన్నమాట వింటూ ప్రమానపడి పోయాడతను.

జాహ్నవి తనకు లభించిన ఆ ఒక్క క్షణంలోనూ ఆయాసపడుతోంది. ప్రతాప్ తన పేరు విని ఆగిపోవడం ఆమెకు సంతసం కలిగించింది.

ప్రతాప్ ఆమెవంక పరిశీలనగా చూశాడు. ఎక్కడా ఆమెలో జాహ్నవి పోలికలు కనిపించడంలేదు. జాహ్నవి అయితే ఆ రంగు వలు పేమిటి? ఆ పళ్ళు ఎందుకు ఎత్తుగా ఉన్నాయి?

అతడికి బాబా మాటలు గుర్తొచ్చాయి. పూజను భగ్నంచేయడానికి ఆ యువతిని దుష్టశక్తులావహించి తనను మోసం చేస్తాయి.

ప్రతాప్ ఆమెమీదకు పులిలా లంఘించాడు—"నువ్వు జాహ్నవివని నాకు తెలుసు. ఆ పేరు చెప్పి భయపెట్టకు. నా జాహ్నవి నా పూజను భగ్నం చేయదు. చెప్పినట్లు వింటుంది...."

జాహ్నవి శతవిధాల ప్రయత్నిస్తోంది. అతణ్ని

చేతులో తీసేస్తోంది. నోటితో తిడుతోంది. వ్యవధి దొరికితే పరుగెడుతోంది. అసహాయనీతిలో ఏడుస్తోంది.

ప్రతాప్ ....మనిషి కాదు....పశువు కాదు....రాక్షసుడు కాదు....

ఆ దుర్మార్గానికి పదం లేదు....

"ఎవ్వరూ నన్ను కరుణించకపోతే—....మృత్యుదేవతా....నువ్వైనా నన్ను కరుణించు...." అని వేడుకుందామె.

సరిగ్గా అప్పటికి బాబా గొయ్యి తవ్వడం పూర్తయింది. తనలో తను సన్నగా నవ్వుకుంటూ ప్రతాప్ ఉన్నవైపు వెడుతున్నాడు బాబా.

• • •

దూరంగా పాడుబడిన శివాలయం కనబడింది రామకృష్ణకి. ఏదో హడావుడి జరుగుతున్నట్లు కూడా వినబడుతోంది అతడికి. పరుగున అక్కడికి చేరాడు.

అక్కడకు చేరిన రామకృష్ణకు ఒక చేతిలో బ్యాటరీ లైటు....మరో చేతిలో రివాల్వర్ ఉన్నాయి.

"ఎవరక్కడ?" అరిచాడు రామకృష్ణ.

హడావుడి ఒక్కసారిగా ఆగిపోయింది.

"నువ్వెవరు?" అది ప్రతాప్ కంఠం.

"ప్రతాప్. నేను రామకృష్ణను. నీ సంగతంతా తెలుసుకుని ఇక్కడకు వచ్చాను" అన్నాడు రామకృష్ణ.

ఉన్నట్టుండి ఓ యువతి పరుగు పరుగున వచ్చి అతణ్ని వాటేసుకుంది—"రామకృష్ణా! సర్వశక్తులూ క్రోడీకరించుకుని నీ దగ్గరకు వచ్చాను. ఈ రాక్షసుడు నా ప్రాణాలు తీసేస్తాడు...."

"ఎవర్నువ్వు?" అన్నాడు రామకృష్ణ.

బ్యాటరీ వెలుగులో ఆమె నగ్నంగా ఉండడమూ, ఒళ్ళంతా రక్తశిక్తమై ఉండటమూ గమనించాడతను. అతడామెను పొదివి పట్టుకుని-"ఎవర్నువ్వు?" అన్నాడు.

"నేను—జాహ్నవిని...." అందామె.

"నువ్వు జాహ్నవివా—నమ్మలేను...."

ప్రతాప్ ముందడుగు వేయబోగా గాలిలో రివాల్వర్ పేల్చి వారించాడు రామకృష్ణ. ప్రతాప్ కసిగా రామకృష్ణను చూస్తున్నాడు.

నేను నిజంగా జాహ్నవిని. బాబా చెప్పాడు—నల్లగా, వికారంగా తయారుకమ్మనమని. మంగళి సలహా తీసుకుని ఈ రోజు అలా తయారై ఇక్కడికి వచ్చాను. ప్రతాప్‌లోని లోపం సవరించబడే అవకాశం నాకే వస్తోందని సంతోషపడ్డాను. కానీ...." ఆమె ఆయాసంతో ఆగింది.

"ఎంతపని చేశావు జాహ్నవీ!" అన్నాడు రామకృష్ణ.

"బాబా!" అరిచాడు ప్రతాప్.

"ఏం నాయనా—నా గొయ్యి తియ్యడం పూర్తయింది...." అన్నాడు బాబా అప్పుడే అక్కడ అడుగు పెడుతూ.

"నువ్విక్కడకి రప్పించింది నా జాహ్నవినేనా?"

"ఆమె అలా చెప్పిందా? ఆ మాటలు నమ్మకు...."

ప్రతాప్ బాబావంక క్రూరంగా చూశాడు—"ఆమె సంగతి అటుంచి, బేతాళుడిపైన ఆనవేసి ఆమె ఎవరో చెప్పు!" అన్నాడు.

"బాబా మాట్లాడలేదు."

"ఆమె జాహ్నవి. అవునా?"

బాబా మాట్లాడలేదు.

"ఎందుకిలా చేశావు—బాబా!"

"నీలోని రాక్షసత్వాన్ని నా స్వార్థానికి ఉపయోగించుకున్నాను. మనుషుల ఆలోచనలను ప్రభావితం చేయగల శక్తి నాకుంది. అంతకుమించి నా శక్తి పెరగాలంటే పదిమంది స్త్రీల రక్తంతో బేతాళుడికి అభిషేకం చేయాలి. అటుపైన ఒక కన్యను బలివ్వాలి.

ఆ కన్య పురుష స్పర్శ ఎరుగనిదిగానూ, పరమ పవిత్రురాలిగానూ, మహా సౌందర్యవంతురాలుగానూ, ఇరువది సంవత్సరాల లోపుగానూ ఉండాలి. అన్ని విధాలా అర్హురాలైనది జాహ్నవి. ఆమె గురించి నీ కారణంగానే నాకు తెలిసింది. నువ్వు నీలోని లోపం గురించి చెప్పగానే నేను జాహ్నవి గురించి పథకం వేశాను. జాహ్నవి గురించి ఆలోచిస్తున్న వారందరినీ తెలుసుకున్నాను. కేవలం నాకోసం నిన్ను పూజకు పురి గొల్పాను. ఆమెపై ఆశలు పెంచుకుంటున్న విజయబాబు ఆలోచనలను ప్రభావితం చేశాను. అతడు హత్యచేయడానికి అనువుగా హంతుడి ఆలోచనలను ప్రేరేపించే వాడిని. చివరకు జాహ్నవి ఆలోచనలను ప్రేరేపించి ఇక్కడకు రప్పించాను.

చివరిలో పూజ భగ్నమవుతుందని బెంగపడకు. ఇప్పుడే నేను రామకృష్ణ ఆలోచనలను ప్రేరేపించాను. అతడు నిన్నేమీ చేయలేడు. నన్ను సర్వశక్తి సంపన్నుణ్ణి చేసే పూజా విధానం పూర్తిచేయి. జాహ్నవి గురించి బెంగపడకు. ఇటుపైన ప్రపంచంలో ఎప్పుడూ అనుభవించని సుఖభోగాలు నీకు కలిగేలా చేస్తాను....ఊ.... త్వరపడు...."

ప్రతాప్ కదలలేదు.

"అవతల గొయ్యి సిద్ధంగా వుంది. ఈ గొయ్యి ఫ్రెష్‌గా ఉండాలని ఇప్పటికిప్పుడు తవ్వాను. సజీవ సమాధికి ఏర్పాటు.... ఊఁ...."

"బాబా!" అని చెవులు దద్దరిల్లేలా అరిచాడు ప్రతాప్. అతడి చేతులు ఊహించని వేగంతో గాలిలోకి లేచి బాబా తలమీద వాలాయి.

బాబా కుప్పలా కూలిపోయాడు. అతడి తల రెండు చెక్కలయింది.

ప్రతాప్ అదే ఊపులో—"జాహ్నవీ!" అంటూ వాళ్ళిద్దరినీ సమీపించాడు. అప్పటికి రామకృష్ణ తేరు కున్నాడు.

ప్రతాప్ జాహ్నవి కాళ్ళమీద పడిపోయాడు— "జాహ్నవీ—నేను మనిషిని కాదు. పశువును...." ఈ మాటలన్నపుడు తొలిసారిగా అతడి కంఠంలో అవ మానం, వేదన, పశ్చాత్తాపం ధ్వనించాయి. అతడు మళ్ళీ- "నేను మనిషిని కాదు .... పశువును...." అన్నాడు. ఈసారి అతడు ఏడుస్తున్నాడు. మరోసారి—"నేను మనిషిని కాదు....పశువును. జా....హ్నా....వీ.... నేను.." అని ఆగిపోయాడు.

ఆ తర్వాత అతను మాట్లాడలేదు.

కొద్ది క్షణాలాగి రామకృష్ణ వంగుని అతడిచేయి పట్టు కున్నాడు. తర్వాత గుండెలమీద చేయి ఉంచాడు. ఆపైన శ్వాస చూసి-"జాహ్నవీ! ఇతడు మరణించాడు" అన్నాడు.

జాహ్నవి బదులివ్వలేదు. ఆమెకు స్పృహ తప్పింది.

రామకృష్ణ చుట్టూ చూశాడు.

తల పగిలివున్న బాబా....

చలన రహితుడైన ప్రతాప్ ....

తెలివిలేని జాహ్నవి....

భయంకరంగా బేతాళ విగ్రహం....

ఎవరో మాంత్రికుడు రాజకుమారుణ్ని బలి ఇచ్చి సర్వ శక్తులూ పొందాలనుకుని ఎన్నో పూజలు చేసి ఎన్నో ఏళ్ళు శ్రమపడ్డాక ఓ రాజకుమారుణ్ని తెచ్చి ఇవ్వబోగా చివరి క్షణాల్లో ఆ రాజకుమారుడే మాంత్రికుణ్ని బలి చేసి సర్వ శక్తులూ తను సంపాదించుకున్నాడు.

జాహ్నవికోసం ప్రతాప్ అక్కడ రక్తపుటేర్లు పారించాడు. కానీ ఆ జాహ్నవి చివరి క్షణాల్లో రామకృష్ణ చేతుల్లో ఉన్నది.

ఆమెలో జీవం ఉన్నదో లేదో తెలియదు. ఉన్న ఆ జీవం నిలుస్తుందో నిలవదో తెలియదు.

"జాహ్నవీ-నిన్ను నేను బ్రతికించుకుంటాను. నీకోసం నా ప్రాణాలైనా అడ్డువేస్తాను. నాకు నువ్వు కావాలి.. నిన్ను చావనివ్వను...." రామకృష్ణ ఆమె శరీరానికి బట్టలు కట్టబెట్టాడు. ఆమెను ఎత్తుకుని అక్కడి నుంచి పరుగెత్తాడు.

* * *

గదిలో పలు జాహ్నవి. ఆమె పక్కన డాక్టర్లు, నర్సులు, హడావుడి....

గది బయట రఘురాం, కృష్ణవేణమ్మ, సుకుమార్, రామకృష్ణ, సీతాపతి, లక్ష్మమ్మ....ఇంకా మరెందరో....

"అప్పుడే ఇంకా ఏమీ తెలియదు...." అంటున్నది లోపల్నుంచి బయటకు వచ్చిన ఓ నర్సు.

అంతా రామకృష్ణ చుట్టూ చేరారు. అతను వారికి చెబుతున్నాడు.

బాబా దగ్గర కొంత ప్రభావం వున్నది. పురుషుల ఆలోచనలను దగ్గర్లో వున్నపుడు ప్రభావితం చేయగల డతడు. అది మానవ మేధస్సులో ఒక భాగమని తెలియక అతడు తానొక మానవాతీతుడునని భ్రమించాడు. జనులతన్ని గుర్తించాలనుకున్నాడు. గుర్తించినవారు అతణ్ని మంత్రగాడన్నారు తప్పితే మానవాతీతుడనలేదు!

ఆ భ్రమతో అతడు క్షుద్ర గ్రంథాలు కొన్ని తిరగేసి ఓ క్షుద్ర పద్ధతిని ఎన్నుకుని తను మహా శక్తిమంతుడు కావాలనుకున్నాడు. ఆ కోరిక తీరకుండానే చచ్చిపోయాడు. మనిషి మెదడును అదుపుచేస్తే, ఏకాగ్రతతో సాధిస్తే ఏమైనా సాధించవచ్చు. హత్యలు, నరబలులు, క్షుద్రదేవతారాధనలు — మనిషి నేరాలు చేయడానికి తప్ప మరేవిధంగానూ సహకరించవు....

మరి ప్రతాప్!

రామకృష్ణ ప్రతాప్ గురించి మాట్లాడుతూంటే సీతాపతి దంపతుల కళ్ళు నీళ్ళతో మసకలు కమ్మాయి.

"ప్రతాప్ ది సున్నితమైన మన స్తత్వం. అయితే అతడిలో ఓ పెద్దలోపం వుంది. అతడు స్త్రీని దారుణంగా హింసించి మాత్రమే అనుభవించగలడు. అతడికి స్త్రీ వాంఛ కూడా ఎక్కువ. ఆ వాంఛతో అతను ఒక పర్యాయం వేశ్య దగ్గరకు వెళ్ళి తన లోపాన్ని గ్రహించాడు. అయితే అతడిలో మరో లోపం వుంది. అతడు అందానికి అన్యాయం చేయలేడు. అందమైన ఆడవాళ్ళను హింసించలేడు. అందమైన ఆడదాన్ని చూడగానే అతడిలో స్త్రీ వాంఛ కలిగితే అతడది తీర్చుకునేందుకు అందవికారంగా వుండే స్త్రీలను ఎన్నుకునేవాడు. అందమైన స్త్రీని కలవాలంటే పూవును నలిపి పారేసిన అనుభూతి

స్ఫురించేది అతడికి. అందుకని అందంగాలేని స్త్రీలతో పరిచయం పెంచుకున్నాడు. అయితే హింసించాలన్న కోరికను అదుపుచేసుకోవడం కష్టమయ్యేది.

అప్పుడు తనకి బాబాతో పరిచయమైంది. బాబా బేతాళ పూజ పేరు చెప్పాడు. ఏ స్త్రీని అతడు కలుసుకున్నా నాలుగింట ఒక్కసారయినా బేతాళ పూజ తప్పనిసరి. అతడి అదృష్టం కొద్దీ — అందుకనుమతించే స్త్రీలూ దొరికారతడికి.

ప్రతాప్ మనసు నిజంగానే విచిత్రమైనది. అతడి దృష్టిలో స్త్రీలంతా ఒక్కటికాదు. అందం, కురూపి తనం.... అంటూ స్త్రీలకు రెండు కులాలు ఏర్పరిచాడు. మనుష్యుల్లో పూర్వం అంటరానివారినీ, బానిసలనూ — ఇతర మనుష్యులే హింసించినట్లు అతను అందానికి దూరంగా ఉంటూ, కురూపితనాన్ని హింసిస్తూ వచ్చాడు. స్త్రీలను, పూలను అతడు ఒకేవిధంగా ప్రేమించేవాడు. మల్లెపూలు వాడినవైనా — ఎవరైనా నలిపితే చూసి సహించలేక పోయేవాడు. అదే మందారమైతే తన చేతులతో నే నలిపి — తలకు నూనె రాచుకోగలిగేవాడు.

సృష్టిలో మనుషుల మధ్య నలుపు తెలుపులనీ, కులాలనీ, మతాలనీ భేదాలు సృష్టించిన మహానుభావుల ప్రభావానికొక విలక్షణ రూపం ప్రతాప్.

తను జాహ్నవిని హింసించానని గ్రహించినపుడు అతను షాక్ తిన్నాడు. తెల్లగా ఉన్న జాహ్నవిని తను ఆరాధించాడు. నల్లగా వుంటే హింసించాడు. ఇంతేనా ఈ తెలుపు నలుపుల తేడా? ఒక్కసారిగా అతడి మస్తిష్కం మేల్కొంది. అతడిలో సంచలనం కలిగింది. తన కిరాతకం

స్ఫురించింది. అతనా షాక్ ను తట్టుకోలేక వెంటనే మర ణించాడు.

మల్లెలు పువ్వులైతే మందారాలూ పువ్వులే! కలవా రింట కలకల నవ్వేది మగువలే అయితే—పొలాలందు నడుం బిగించి చకచకలాడించేది మగువలే! సమదృష్టి.... సమదృష్టి మనిషికి కావాలి...." రామకృష్ణ చెప్పటం ఆపాడు.

తలుపులు తెరుచుకున్నాయి.

డాక్టరు బయటకు వచ్చాడు.

ఆయనేం చెబుతాడన్నదే రామకృష్ణకు ఇప్పుడు కావలసింది!

జాహ్నవి బ్రతుకుతుందా? బ్రతికితే రామకృష్ణను అంగీకరిస్తుందా?

రామకృష్ణ కనులముందు ఒకే ఒక్క దృశ్యం మెదు లుతోంది.

జాహ్నవి ప్రతాప్ ని విడిపించుకుని తనవద్దకు పరు గెత్తుకు వస్తోంది. తనేసితిలో ఉన్నానని ఆమె ఆలో చించటంలేదు. ఆమె అప్పుడు ప్రతాప్ అసలు స్వరూపం చూసింది. తననే సర్వస్వంగా నమ్మింది.

"రామకృష్ణా! సర్వశక్తులూ క్రోడీకరించుకుని నీ దగ్గరకు వచ్చాను. ఈ రాక్షసుడు నా ప్రాణాలు తీసేస్తాడు...."

"నేను జాహ్నవిని...."

"నేను నిజంగా జాహ్నవిని...."

రామకృష్ణ జాహ్నవిని గట్టిగా పొదివి పట్టుకున్నాడు. అప్పటి ఆ అనుభూతి అతనికిప్పుడు తెలుస్తోంది. తనువు పులకరిస్తోంది.

ఒక బేతాళ విగ్రహం, తల పగిలిన బాబా, చలన రహితుడైన ప్రతాప్, మూతబడిన పదిగోతులు.... ఓ పెద్ద విషాద గాథ....

ఇంతకూ మధ్య తనకు కలిగిన అనుభూతిలోని తియ్యదనాన్ని వెతుక్కుంటున్నాడు రామకృష్ణ.

ఆ అనుభూతి తాత్కాలికమా, శాశ్వతమా?

ఏది ఏమైనా ఇది పూర్తిగా రామకృష్ణకు సంబంధించిన విషయం.

ఆ అనుభూతిని శాశ్వతం చేసుకోవాలనుకుని మానవాతీత ప్రయత్నాలు చేసిన ప్రతాప్ ఇప్పుడు లేడు.

—:సమాప్తం:—